## క్లుప్తంగా

### మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ.పటవ్ధన్, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్, ఐక్యూసీ కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సర్వర్ పాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

### 24న బీచ్‌వాలీబాల్ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న మంచిర్యాల బాయ్స్ పాఠశాల మైదానంలో అండర్–17 బాలబాలికల జోనల్ బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణిరాజా తెలిపారు. పోటీలకు జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మాత్రమే అర్హులన్నారు. ఎలిజిబిలిటీ ఫామ్–4 సెట్స్ జోనల్‌కు తీసుకురావాలని సూచించారు.

### కొనుగోలు కేంద్రాల పరిశీలన

జన్నారం: మండలంలోని కలమడుగు, మొర్రిగూడ, ఇందన్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం డీఎం శ్రీలత, డీసీఎస్‌వో బ్రహ్మారావు సందర్శించారు. ధాన్యం తూకం వేస్తున్న తీరు, తేమశాతం పరిశీలించారు. కొనుగోళ్లు పారదర్శకంగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా, సంచుల కొరత లేకుండా చూడాలని సూచించారు. వారి వెంట బుక్ కీపర్ రమేశ్, సిబ్బంది ఉన్నారు.

### కేజీబీవీ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలి

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం అమలుచేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, ప్రధాన కార్యదర్శి రాజావేణు డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ కేజీబీవీ, యూఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా సుమన చైతన్య, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఆసియాబాను, సంతోష్ ఎన్నికైనట్లు తెలిపారు. ఈ నెల 28న మహధర్నా విజయవంతం చేయాలని కోరారు.

### హాజీపూర్ ప్రత్యేకాధికారిగా డీఆర్డీవో కిషన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ప్రత్యేకాధికారిగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి(డీఆర్డీవో) కిషన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మండల ప్రత్యేకాధికారిగా ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) యాదయ్యకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో మండల ప్రత్యేకాధికారి బాధ్యతలను డీఆర్డీవో కిషన్‌కు అప్పగించారు.

### 'అంబానీకి బీఎస్‌ఎన్‌ఎల్.. అదానీకి సింగరేణి'

కాసిపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబానీకి బీఎస్‌ఎన్‌ఎల్, అదానీకి సింగరేణి ఆస్తులు కట్టబెట్టాలని కుట్రలు చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి విమర్శించారు. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట 2గని, మండలంలోని కొండాపూర్‌యాప, మల్కేపల్లి, కోమటిచేను, ముత్యంపల్లి, కాసిపేట గ్రామాల్లో బొగ్గు బ్లాకుల ప్రైవేట్ పరం చేసే కుట్రకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, నాయకులు సిడం జంగుబాయి పాల్గొన్నారు.

### మతిస్థిమితం లేని యువకుడు అప్పగింత

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గత కొన్నేళ్లుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న యువకుడిని పోలీసులు శుక్రవారం కల్వరీ వృద్ధాశ్రమానికి అప్పగించారు. మతిస్థిమితం లేని యువకుడిని స్థానికులు గుర్తించి 100 డయల్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసులకు అక్కడికి చేరుకుని అతన్ని చేరదీసి నిర్వాహకుడు కుమార్‌కు అప్పగించారు.

### ప్రజాపాలనపై కళాజాత

దండేపల్లి: ప్రజాపాలన సంబురాలపై దండేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం సాంస్కృతిక సారధి కళాకారులు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కళాకారులు, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గూడెంలో భక్తుల పూజలు



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు



సత్యనారాయణ వ్రతాలు నోముతున్న భక్తులు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయానికి శుక్రవారం కార్తిక బహుళ సప్తమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సత్యదేవున్ని దర్శించుకోవడంతో పాటు, ప్రత్యేక పూజలు చేశారు. 301జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా కనిపించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయడంతో పాటు, ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

### ఊట్ల పాఠశాలను సందర్శించిన ఏసీఎంవో



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఏసీఎంవో

దండేపల్లి: మండలంలోని ఊట్ల గిరిజన ప్రాథమిక పాఠశాలను ఏసీఎంవో రాజమౌళి శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల ప్రతిభ సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గిరిజన సంక్షేమశాఖ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు పాఠశాల టైమింగ్స్ ప్రకారం ఉదయం పిల్లలతో పాటు దిగిన ఫొటోలతో పాటు, మధ్యాహ్నం భోజనం పెడుతున్నప్పుడు, సాయంత్రం పాఠశాలను వదిలేటప్పుడు మొత్తం మూడు ఫొటోలను జీపీఎస్ గ్రూపులలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతిరోజు విద్యార్థులకు హోం వర్క్ ఇచ్చి, మరుసటి రోజు వాటిని తనిఖీ చేసి, డేట్‌తో సహా సంతకం చేయాలన్నారు. ఎస్‌ఆర్‌పీ రఘునాథం, హెచ్‌ఎం బిక్‌నా ఉన్నారు.

# చోరీలతో బెంబేలు..!

- కలకలం సృష్టిస్తున్న దొంగతనాలు
- భయాందోళనలో ప్రజలు



ఆంధ్రాకాలనీలో దొంగతనం జరిగిన ఇంటిలో క్లూస్ టీంతో పరిశీలన

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో దొంగతనాలు కలకలం సృష్టిస్తున్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యం చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. రెండు నెలల నుంచి సుమారు పదికి పైగా దొంగతనాల కేసులు చోటు చేసుకోగా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆస్తి నష్టం అధిక సంఖ్యలో జరగకపోయినా, పోలీసులకు మాత్రం దొంగలను పట్టుకోవడం సవాలు మారుతోంది. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగానే, మరో చోట చోరీలు జరుగుతుండడం గమనార్హం.

**కొన్ని ఘటనలు...**

- ఈ నెల 11వ తేదీన అంబేద్కర్ చౌక్ సమీపంలో దొంగలు తుపాకీతో బెదిరించగా ఇంటి యజమానులు లైట్లు వేసి, అరవడంతో పారిపోయారు.
- అక్టోబర్ 26 రోజు ఆంధ్రాకాలనీలో ఇంటి యజమానులు తాళం వేసి వెళ్లగా, తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. సుమారు రూ.60వేలు ఎత్తుకెళ్లారు.
- అక్టోబర్‌లో మిషన్ కాంపౌండ్ ఏరియాలో తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరగ్గా, రూ.11000 ఎత్తుకెళ్లారు.
- అక్టోబర్ నెలలో గోదావరి రోడ్, పలు ఏరియాల్లో దొంగతనాలు జరగ్గా డబ్బులు ఏమి పోలేదు. యజమానులు దొంగతనం జరుగుతుండగా గుర్తించారు. దొంగలు పారిపోయారు.
- కొన్ని పాత ఇళ్లలోను దొంగతనాలు జరగ్గా, ఆస్తి నష్టం లేకపోవడంతో బయటకు రావడం లేదు.

**చర్యలు తీసుకుంటున్నాం**

పట్టణంలో జరుగుతున్న దొంగతనాలపై చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు కొన్ని కేసులు నమోదు చేశాం. తుపాకీతో దొంగతనానికి పాల్పడ్డ దొంగల కోసం ప్రత్యేక సిబ్బందితో విచారణ చేపడుతున్నాం. ప్రజలు ఇళ్లకు తాళం వేసి వెళ్తే సమాచారం ఇవ్వాలి. ప్రజల శాంతి భద్రతల కోసం కృషి చేస్తాం. – సతీశ్, ఎస్సై, లక్సెట్టిపేట

## సంక్షిప్త వార్తలు

**1న హలో మాల, చలో హైదరాబాద్**

దండేపల్లి/జన్నారం: మాలలు, మాల ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న హలో మాల, చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు మాలమహానాడు జిల్లా కన్వీనర్ సుధాకర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను దండేపల్లి, జన్నారం మండలాల్లో శుక్రవారం అంబేద్కర్ విగ్రహాల ఎదుట ఆవిష్కరించారు.సింహగర్జనకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

**జూనియర్ లెక్చరర్‌గా కమలాకర్**

మంచిర్యాలక్రైం: ఇటీవల తెలంగాణ ప్రభుత్వం టీజీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన జూనియర్ లెక్చరర్ రిక్రూట్‌మెంట్ ఫలితాల్లో సీసీసీ కార్నర్‌కు చెందిన సిరిమెల కమలాకర్ ఎంపికయ్యాడు.

**రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలి**

వేమనపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులు వరి, పత్తి పంటల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఏఈవో హెప్సిబ అన్నారు. క్యాతన్‌పల్లిలో శుక్రవారం వరికోతల యంత్రం దగ్గరికి వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ ఈకేవైసీ సన్నవడ్లకు రూ.500బోనస్ గురించి, ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. జన్నారం: రైతులు వరికోత సమయంలో హార్వెస్టర్ ఫ్యాన్ స్పీడ్ 19ఆర్‌పీఎం ఉండేలా చూసుకోవాలని దీనిద్వారా తాలు, తప్పా లేని నాణ్యమైన వడ్లు పొందవచ్చని ఏఈవో అక్రముల్లా పేర్కొన్నారు. మండలంలోని కిష్టాపూర్‌లో శుక్రవారం హార్వెస్టర్ డ్రైవర్లు, రైతులకు అవగాహన కల్పించారు.

**పాఠశాల సందర్శన**

దండేపల్లి: మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో చిన్నయ్య శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో అమలుచేస్తున్న వినూత్న కార్యక్రమాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

**ఆత్మగౌరవ సభ విజయవంతం చేయండి**

దండేపల్లి: మంచిర్యాల వైశ్యభవన్‌లో శనివారం నేతకాని ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు జాడి ఇసాకర్ తెలిపారు. దండేపల్లిలో శుక్రవారం సంఘనాయకులతో కలిసి మాట్లాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ హాజరయ్యే సభకు, నేతకాని కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

**వన్యప్రాణులను వేటాడితే చర్యలు తప్పవు**

మందమర్రిరూరల్: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు హెచ్చరించారు. మండలంలోని సారంగపల్లి గ్రామంలో శుక్రవారం ఆ గ్రామస్తులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఇటీవల సారంగపల్లి శివారులోని దుబ్బపల్లి అటవీ ప్రాంతంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగల ఉచ్చుకు రెండు గేదెలు బలైన విషయాన్ని గుర్తుచేస్తూ వన్యప్రాణుల సంరక్షణకు ఎలాంటి చట్టాలు ఉంటాయో వివరించారు. అడవులను, వన్యప్రాణులను కాపాడుకుంటే సమతుల్య వాతావరణం కలుగుతుందని వివరించారు. వన్యప్రాణుల వేటగాళ్లకు కఠినమైన చట్టాల ద్వారా కేసులు ఉంటాయని, అలాంటి వారికి జైలు తప్పదని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజేశ్వరి ఉన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి**

వేమనపల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) వద్ద కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.

## 'దివ్యాంగులపై ప్రభుత్వం నిర్లక్ష్యం'



నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

పాతమంచిర్యాల: వికలాంగులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ కో చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ప్రభుత్వం తీరుపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి విస్మరించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు బూర్ల మహేందర్, మెడపట్ల సతీష్, బీవీ అప్పారావు, రాచర్ల రాజయ్య, రామశ్రీనివాస్, నరేష్, రమేష్, మల్లేష్, శ్రీనివాస్ లింగమూర్తి, రవి పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ లీకేజీతో మురికికూపం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నీటి లీకేజీతో ఓ ప్రైవేట్ పాఠశాల పక్కన ప్రాంతమంతా మురికి కూపంగా మారింది. దుర్వాసన వెదజల్లుతోంది. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ట్యాంక్ సందర్శన కోసం వచ్చిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరిజను శుక్రవారం స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై ఏఈ గిరిజను 'సాక్షి' వివరణ కోరగా వారం రోజుల్లో నీటి లీకేజీ అరికడతామని తెలిపారు.

## ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలి



తహసీల్దార్ జోత్స్నకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: భూకబ్జాదారుల కబంధ హస్తాల్లో ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ జ్యోత్స్నకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూశాఖ అధికారులు శ్రద్ధ పెట్టకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, నాయకులు రమేష్, సతీష్ పాల్గొన్నారు.

### 'నేనెవరికీ భూమి అమ్మలేదు'

బెల్లంపల్లి: మండలంలోని కన్నాల శివారు సర్వే నంబర్ 89/2/1లో ఉన్న భూమిని తానెవరికి అమ్మలేదని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆ భూమిని తాను అమ్మినట్లు ఆరిజిన్ డెయిరీ పేరుతో ఆదినారాయణ అనే వ్యక్తి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆ భూమి షిండే దేవానంద్ అనే రైతుకు చెందినదని, ఆ భూమితో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తనవద్ద భూమిని కొనుగోలు చేశానని మాయ మాటలు చెప్పి, కొంతమంది దగ్గర డబ్బులు తీసుకుని భూమి అమ్మడానికి ఆదినారాయణ యత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం కొంతమంది ఆ భూమి వద్దకు వచ్చారని, ఆ భూమిని తాను కానీ, ఆదినారాయణ కానీ, క్రయ విక్రయాలు చేయడం జరగలేదని తెలిపారు. ఆ భూమితో ఆదినారాయణకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

### భూమి కొనుగోలు చేయించి మోసం చేశారని ఆరోపణ

బెల్లంపల్లి: తమతో కొనుగోలు చేయించిన భూమిని రిజిస్ట్రేషన్ చేయిస్తానని నమ్మబలికి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మోసానికి పాల్పడ్డారని ఆరిజిన్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కందిమళ్ల ఆదినారాయణ ఆరోపించారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి చదును పనులు చేయిస్తుండగా మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య అక్కడికి వచ్చి కూలీలను అక్కడి నుంచి వెళ్లిపోవాలని, లేదంటే పోలీసు కేసు పెట్టిస్తానని బెదిరించారని వాపోయారు. ఏమాత్రం దమ్ము, ధైర్యం ఉన్నా చిన్నయ్య తానున్న సమయంలో భూమివద్దకు వచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు. సమావేశంలో కూలీలు దుర్గా భవానీ, హరిబాబు, శరణ్య, ప్రణీత, శివ తదితరులు పాల్గొన్నారు.

## ■ బొగ్గుబాయి వార్తలు

### నిర్వహణ మెరుగ్గా ఉండాలి



జీటీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎస్‌వోటు జీఎం

శ్రీరాంపూర్: కంపెనీ క్వార్టర్లు, జీటీ హాస్టల్ వంటి వాటిలో సివిల్ పనుల నిర్వహణ మెరుగ్గా ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటు జీఎం యస్ సత్యనారాయణ తెలిపారు. నస్పూర్‌కాలనీలోని జీటీ హాస్టల్, ఆర్కే 5కాలనీ, కృష్ణకాలనీ, శ్రీరాంపూర్ కాలనీలోని సింగరేణి క్వార్టర్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సివిల్ అధికారులతో వీటి నిర్వహణపై చర్చించారు. విద్యుత్ సరఫరా, నీటి సరఫరా సరిగ్గా ఉండాలన్నారు. పారిశుద్ధ్య సమస్య లేకుండా ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు తనిఖీ చేసి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) అరవింద్ రావు, డీజీఎం (సివిల్) ఆనంద్‌కుమార్, ఎంవీటీసీ మేనేజర్ వెంకట రామారావు, వర్క్‌షాప్ ఎస్‌ఈ రాంరెడ్డి, ఫోర్మెన్ మహేష్ రాజు పాల్గొన్నారు.

### విధుల్లోకి తీసుకోవాలి

మందమర్రిరూరల్: ఏరియాలో విధులు నిలిపివేసిన ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను యాజమాన్యం వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఎదుట సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ఆందోళన చేపట్టారు. అనంతరం అధికారికి వినతిపత్రం అందించారు. కాంట్రాక్టర్‌ను ఖరారు చేసేంత వరకు యాజమాన్యమే చొరవచూపి, వారికి విధులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు తదితరులు పాల్గొన్నారు.

## 'బొగ్గు గనుల వేలం రద్దు చేయాలి'



సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

శ్రీరాంపూర్: తెలంగాణలోని బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని రద్దు చేసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని పలు గనులపై, కూడళ్ల వద్ద వేలంను వ్యతిరేకిస్తూ ఉద్యోగులతో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని శ్రావణ్‌పల్లి బొగ్గు బ్లాకును వేలం వేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ బ్లాకును సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా సింగరేణి గనులతో అభివృద్ధి సాధించిందని, నేడు గనులు ప్రైవేట్ పరమైతే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ప్రేమ్ కుమార్, నాయకులు మిడివెల్లి రాజ్ కుమార్, మోహన్, మహేష్, పాయిరాల రాములు పాల్గొన్నారు.

## గైర్హాజర్ కొనసాగిస్తే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: గైర్హాజర్‌ను కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఆర్పీ గ్రూప్ ఏజెంట్ సీహెచ్ వెంకటేశ్వర్లు గైర్హాజరు ఉద్యోగులను హెచ్చరించారు. ఎస్‌ఆర్పీ 1 గని క్యాంటీన్‌లో శుక్రవారం గైర్హాజరు కార్మికులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సంవత్సరంలో 100మస్టర్లు నిండని వారిపై క్రమ శిక్షణ చర్యలు ఉంటాయన్నారు. సింగరేణిలో ఉద్యోగం చేయడం అదృష్టంగా భావించాలన్నారు. చిన్న చిన్న కారణాలకు డ్యూటీలకు రాకుండా గైరాజరైతే ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా మార్పు తెచ్చుకొని, డ్యూటీలకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ విజయ్‌కుమార్, సంక్షేమ అధికారి సాదన్, అధికారులు సత్యనారాయణ, క్రాంతికుమార్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొమురయ్య, ఫిట్ సెక్రటరీ దాడి రాజయ్య పాల్గొన్నారు.

### ఫిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7గనిలో మున్నూరు కాపు ఉద్యోగుల సంఘం నూతన ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. గనిపై శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం, గని అండర్ మేనేజర్ కొత్తపల్లి రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫిట్ కమిటీ కార్యదర్శిగా చిలుకూరి జగదీష్ పటేల్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీగా ఆడెపు మధుకర్ పటేల్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కుల సంఘం నాయకులు నాగరాజు, రౌతు సత్యనారాయణ, రామచందర్, బొలిశెట్టి శ్రీకాంత్, సమ్మయ్య, శ్రీనివాస్, దండే రాకేష్, అప్పల విజయ్, రాజేందర్ పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత



సీజ్ చేసిన ట్రాక్టర్

భీమారం: మండలంలోని మద్దికల్–ఆరెపల్లి మధ్య గల రిజర్వు ఫారెస్ట్‌లోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం రాత్రి పట్టుకున్నట్లు మంచిర్యాల అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు తెలిపారు. పక్కా సమాచారంతో సిబ్బంది అక్కడికి వెళ్లి ట్రాక్టర్‌ను పట్టుకున్నారని పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి అటవీశాఖ కార్యాలయానికి తరలించామన్నారు. ట్రాక్టర్ యజమాని సంజీవరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.